


మన భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం
సోమవారం 15 జూన్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2




# ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారానే సమాజ ప్రగతి సాధ్యం

భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా పెరిక కుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం సూర్యాపేటలోని రాకేష్ బి.ఎడ్ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర పెరిక కుల కార్పొరేషన్ చైర్మన్ శ్రీ దొంగరి వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కృషి, పట్టుదలతో చదువుకుంటే జీవితంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. విద్యే సమాజ అభివృద్ధికి మూలాధారమని, నేటి విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తని పేర్కొంటూ, పెరిక కుల కార్పొరేషన్ విధివిధానాలు పూర్తికాగానే ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూతను అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సూర్యాపేట జిల్లా పెరిక కుల సంఘం ముఖ్య సలహాదారు డా. మిన్నా శివరామకృష్ణ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవాలంటే క్రమశిక్షణ, అంకితభావం అవసరమని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల విద్యాభివృద్ధికిప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సూర్యాపేట జిల్లా పెరిక కుల సంఘం అధ్యక్షులు బందు శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారానే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. భవిష్యత్తులో కూడా ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్, సీబీఎస్ఈ పరీక్షల్లో ప్రతిభ



కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు నగదు పురస్కారాలు, మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల విజయాల్లో కీలక పాత్ర పోషించిన తల్లిదండ్రులను కూడా అభినందించి సత్కరించారు.




# అనునిత్యం జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమమే టి యు డబ్ల్యూ జే ఐజేయు ధ్యేయం

భానుపురి /సూర్యాపేట టౌన్

జర్నలిస్టుల కోసం అనునిత్యం అవిరళ కృషి చేస్తూ సంక్షేమం, అభివృద్ధి కోసం కంకణ బద్ధులైనది కేవలం అతి పెద్ద యూనియన్ అయిన టియూడబ్ల్యూజే ఐజేయు మాత్రమే అని స్పష్టం చేశారు. సభ్యత్వ నమోదు లో భాగంగా జర్నలిస్టు లు సంకర మద్ది సుధీర్ రెడ్డి లతోపాటు షేక్ సయ్యద్, పేర్ల గణేష్ లకు సభ్యత్వం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్లబొల్లి కబుర్లు ఇతర యూనియన్ల మాదిరిగా చెప్పకుండా కేవలం చెప్పింది చేయడం, ఆచరణతో అమలు చేయడం, దమ్ము, ధైర్యం ఉన్న టి యు డబ్ల్యూ జే ఐజేయు కి మాత్రమే క్రెడిట్ చెందుతుందని వివరించారు. అర్హులైన జర్నలిస్టుల అందరికీ కూడా అక్రిడిటేషన్లు అందే విధంగా జిల్లా మీడియా కమిటీలు మెజార్టీ సభ్యులుగా టీయూడబ్ల్యూజే ఐజేయు సభ్యులు కృషి చేస్తున్నారని వెల్లడించారు. యూనియన్ రాష్ట్ర నాయకత్వం నిర్ణయాలకు అనుగుణంగా ముందుకు పోతూ ఒక క్రమశిక్షణ కలిగిన సంఘంగా టి యు డబ్ల్యూ జె ఐజేయు నిలుస్తుందని వెల్లడించారు. జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు పూర్తిస్థాయిలో సాధించేవరకు రాజీలేని పోరు తప్పదని, హెల్త్ కార్డులు కూడా అర్హులైన అందరికీ అందుతాయని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అపోహలు ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం



చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ బంటు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా దేవాలయ 25 వసంతాల వేడుకకు మాజీమంత్రి జగదీష్ రెడ్డి కి ఆహ్వానం



భానుపురి/సూర్యాపేట ప్రతినిధి

సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీ సాయిబాబా దేవాలయం నిర్మించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 17, 18, 19 తేదీలలో నిర్వహించనున్న 25 వసంతాల మహోత్సవానికి మాజీ మంత్రి,సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సంబంధిత ఆహ్వాన పత్రికను అందజేసి.. ఆశీర్వచనం చేసిన ఆలయ అర్చకులు పాల్గొన్న రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ నాయకులు ఉప్పల ఆనంద్,అధ్యక్షులు కర్నాటి రవి,కోశాధికారి పోతుగంటి మల్లికార్జున్, గోపగాని వెంకట నారాయణ, పుట్ట కిషోర్,వెంపటి ప్రభాకర్ , విశ్వేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల ఉద్యమాలకు దిక్సూచి పి. సుబ్బారావు

భానుపురి /మిర్యాలగూడ

మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల కోసం జీవితాంతం అలుపెరుగని పోరాటం చేసిన ప్రముఖ ప్రజాహక్కుల ఉద్యమకారుడు, విద్యావేత్త, సామాజిక చైతన్యవేత్త పి. సుబ్బారావు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మిర్యాలగూడలోని కళాభారతి ఎన్ఎస్‌పి క్యాంప్‌లో ఆదివారం నిర్వహించిన పి. సుబ్బారావు సంస్మరణ సభ భావోద్వేగ వాతావరణంలో జరిగింది. మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీ, ప్రజాసంఘాలు, ఆయన శిష్యులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హెచ్ఆర్ఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు అక్కెనపల్లి వీరస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర నాయకులు గోసుల మోహన్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు ప్రసంగిస్తూ పి. సుబ్బారావు జీవితం ప్రజా ఉద్యమాలకు ఒక ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే హేతువాద భావజాలం, మార్క్సిస్టు సిద్ధాంతాలు, పర్యావరణ పరిరక్షణ అంశాల పట్ల ప్రత్యేక ఆసక్తి పెంచుకున్న ఆయన, తన జీవితాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితం చేశారని గుర్తు చేశారు. సమాజ మార్పు కోసం నిరంతరం పోరాడిన ఆయన జీవితం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్మరణ సభలో ప్రజలు, మానవ హక్కుల కార్యకర్తలు, మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం సంస్మరణ సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పొన్నారు రమేష్, ఉదయ, కిరణ్మయి, సృజన,



అజయ్, నీరజలతో పాటు డాక్టర్ ఎం. రామారావు, డాక్టర్ రాజు, చెన్నూరు రంగారావు, సీడీ రవికుమార్, డాక్టర్ కృష్ణయ్య, రామయ్య సార్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షురాలు బంద్రు విమల, సీఎంఎస్ రాధా, జూలూరు గౌరీశంకర్, సామాజిక ఉద్యమకారుడు సజయ , అంబటి వెంకన్న, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాజీమంత్రి జగదీష్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదే శ్రీనివాసులు



భానుపురి/సూర్యాపేట ప్రతినిధి

సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదే శ్రీనివాసులు ఆదివారం మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ని క్యాంపు కార్యాలయంలో ఆర్యవైశ్య మహాసభ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. బెలిదే శ్రీనివాసులు ఇటీవల సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల్లో విజయం సాధించడంతో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం లో ప్రతి కుల సంఘం కు భవన్ నిర్మాణానికి స్థలం ఇచ్చినట్లు తెలిపారు. ఆర్య వైశ్యులు సంఘటితంగా ఉండి సంఘం అభివృద్ధి కి పాటు పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు బండారు రాజా,ఉప్పల ఆనంద్, జిల్లా కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, గోపారపు రాజు బిక్కుమల్ల కృష్ణ, బెలిదే అంజయ్య, బొమ్మిడి అశోక్, కుంచమర్తి రాజ శేఖర్, సోమ వెంకటేశ్వర్లు,ఉమా మహేశ్వర్ ,ఉప్పల శ్రవణ్ కుమార్, బొల్లం సురేష్, శెట్టి డో గుపర్తి ప్రవీణ్ , గుడిపాటి రమేష్,మిట్టపల్లి రమేష్,తోట లచ్చయ్య, పసుమర్తి కృష్ణ మూర్తి,శ్రీనాథ్ లు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు

భానుపురి/అచ్చం పేట

వివాహం అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ ఇస్తామని ప్రకటించిన విజయ్ దేవరకొండ ఇచ్చిన మాట ప్రకారం అచ్చంపేట డివిజన్ పరిధిలోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో 9వ,10వ తరగతి పరీక్షల్లో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సాధించిన విద్యార్థుల జాబితాను విడుదల చేసిన ది దేవరకొండ ఫౌండేషన్.



# కల్నల్ సంతోష్ బాబు ఆల్ ఇండియా పిడె రేటెడ్ చెస్ పోటీలలో పాల్గొనాలి



భానుపురి/సూర్యాపేట టౌన్

జూలై నెల 11,12వ తేదీలలో హైదరాబాదులోని నిజాంపేట్ రోడ్డు బాచుపల్లి లో ఎల్ ఎ స్ కె చెస్ అకాడమి, తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ మరియు ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆద్వర్యంలో జరిగే మహా వీర చక్ర కల్నల్ సంతోష్ బాబు ఆల్ ఇండియా ఓపెన్ ఫీడ్ రేటెడ్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ లో ఆసక్తిగల విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుపొందాలని సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గందూరి కృపాకర్ అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని టి టి డి కళ్యాణ మండపం లో కల్నల్ సంతోష్ బాబు ఫిడె చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలను సూర్యాపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో తాము నిర్వహించే చెస్ పోటీలలో పాల్గొని చాలామంది విద్యార్దులు ఇతర ప్రాంతాలలో జరిగే చెస్ పోటీలలో విజేతలుగా నిలుస్తున్నారని అన్నారు. ఆదివారం జరిగిన చెస్ పోటీలలో గెలుపొందిన విజేతలు ఇందిర, రవికుమార్, దీక్షిత్, జతిన్ రెడ్డి, అఖిలేష్, చిద్విలాసిని లకు ఆయన బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సంతోష్, ట్రెజరర్ వెంకట మురళి, ఉపాధ్యక్షులు సాయికుమార్, జాయింట్ సెక్రెటరీ లింగా రెడ్డి , ఆర్గనైజర్ కోచ్ శ్రీనివాస రాజు, మనోజ్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ పై అవగాహన సదస్సు



భానుపురి /సూర్యాపేట టౌన్

తెలంగాణ ఆయిల్ పామ్ రైతుల సంఘం ఆధ్వర్యంలో, శ్రీ బయోఏస్తెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో సూర్యాపేటలో నిర్వహించిన ఆయిల్ పామ్ రైతుల అవగాహన సదస్సుకు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 300 మంది రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భూమి లోని ఉపయోగకర సూక్ష్మజీవుల (మైక్రోబ్స్) ప్రాధాన్యం, అవి పంట పోషణ, నేల ఆరోగ్య మెరుగుదల, వ్యాధి నివారణ మరియు అధిక దిగుబడుల సాధనలో పోషించే పాత్ర గురించి రైతులకు వివరించారు.అలాగే శ్రీ బయోఏస్తెటిక్స్ సంస్థ అభివృద్ధి చేసిన సాయిల్ ఫస్ట్ వ్యాక్సినేషన్ కిట్ ను ప్రదర్శించి, ఆయిల్ పామ్ మొక్కల వేర్ల వద్ద ఉపయోగకర సూక్ష్మజీవులను స్థిరపరచడం ద్వారా పంట ఆరోగ్యం దిగుబడులను మెరుగుపరచే విధానాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో శ్రీ బయోఏస్తెటిక్స్ వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున రావు, సీనియర్ టెక్నికల్ మేనేజర్లు శివకుమార్, చరణ్, తెలంగాణ మేనేజర్ లింగస్వామి పాల్గొని రైతులతో మమేకమయ్యారు.సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా. కె.ఆర్.కె. రెడ్డి నాయకత్వంలో శ్రీ బయోఏస్తెటిక్స్ సంస్థ నేల ఆరోగ్య పరిరక్షణ, సూక్ష్మజీవ ఆధారిత వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం మరియు రైతుల ఆదాయ వృద్ధికి కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.రైతులు ఈ కార్యక్రమంపై సానుకూల స్పందన వ్యక్తం చేస్తూ, అందించిన శాస్త్రీయ సమాచారం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని అభిప్రాయపడ్డారు.

# సింగరేణి కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడుతున్నారు

-అసలైన ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోందిమల్లు భట్టి విక్రమార్క



భానుపురి

బొగ్గు నిల్వలు మాయమైనట్లుగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో శ్రీరాంపూర్ ఓసీపీ వద్ద సింగరేణి అధికారులతో కలిసి ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ఈరోజు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు పర్యటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. సింగరేణి కార్మికుడి శ్రమ, చెమటని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు మాట్లాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సింగరేణిపై చేస్తున్న ఆరోపణలతో తన మనసు కలచి వేసిందని.. అందుకే అధికారులతో కలిసి ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామని వివరించారు. మీ రాజకీయాల కోసం, స్వార్థం కోసం తెలంగాణ భవిష్యత్తు అయిన సింగరేణిని అపహాస్యం చేయొద్దని హితవు పలికారు. బొగ్గును వెలికి తీసిన తర్వాత గ్రేడ్‌ల వారీగా స్టాక్ పెడతామని వివరించారు. నిల్వలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని వివరించారు. బొగ్గు తరలించే వాహనాలకు జీపీఎస్ సైతం ఉంటుందని స్పష్టం చేశారు. విజిలెన్స్ మానిటరింగ్ కూడా ఉంటుందని చెప్పుకొచ్చారు. కిలో బొగ్గు బయటకు వెళ్లే అవకాశం లేదని తేల్చిచెప్పారు.

# మైనర్ల రక్షణలో మహిళా పోలీసులు కీలకం





-పోక్సో చట్టంపై మహిళా కానిస్టేబుళ్ల అవగాహన

-ప్రజలతో మమేకమై బాధ్యతగా పనిచేయాలి

-సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమంద రాజు

భానుపురి/హుజూర్ నగర్

హుజూర్ నగర్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా కానిస్టేబుళ్లకు పోక్సో (పొక్సో) చట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమంద రాజు, ఎస్సై నరేష్ హాజరై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సీఐ చరమంద రాజు మాట్లాడుతూ.. మైనర్ బాలికల రక్షణలో మహిళా పోలీస్ కానిస్టేబుళ్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పోక్సో చట్టంలోని నిబంధనలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని, క్షేత్రస్థాయిలో బాలికలకు చట్టాలపై చైతన్యం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు 'పోలీస్ భరోసా' కార్యక్రమం ద్వారా భద్రతా అంశాలు, ఆపదలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అంతేకాకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మహిళా కానిస్టేబుళ్లు ఎలా వ్యవహరించాలి, బాధితుల ఫిర్యాదులను స్వీకరించేటప్పుడు పాటించాల్సిన మర్యాదపూర్వక పద్ధతులు, జనరల్ డైరీ ఎంట్రీలు నమోదు చేయడం, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. సమాజంలో బాధ్యతాయుతమైన పోలీస్ సిబ్బందిగా పనిచేస్తూ, మహిళలు,బాలికల రక్షణకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# భూమి చిస్తూ తెస్తే కాంగ్రెస్ కు పుట్టగతులు ఉండవు

-మల్లీ పటేల్, పట్వారి వ్యవస్థకు జీవంపోస్తే సహించం

-సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్




భానుపురి/యాదాద్రి భువనగిరి

భూమి చిస్తూ తెస్తే కాంగ్రెస్ కు ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి. జహంగీర్ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో మల్లీ పటేల్, పట్వారి వ్యవస్థకు జీవంపోస్తే సహించే లేదని అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి సీపీఎం మండల కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జహంగీర్ పాల్గొని ప్రసంగించారు ఆనాడు కమ్యూనిస్టులు, పేద రైతాంగం, ప్రజలందరూ కలిసి పోరాడిన ఫలితంగా 1984 జనవరి 6న పటేల్, పట్వారి వ్యవస్థను మరియు భూమి చేస్తున్న ఎన్టీరామారావు రద్దు చేశారని తెలిపారు. వక్రబుద్ధి కలిగిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పాత విధానాన్ని తీసుకురావడానికి కసరత్తు చేస్తున్నట్లు స్వయంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల ఖమ్మం పర్యటనలో బయటపెట్టాడని అన్నారు. దీనితో రైతుల్లో ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. నాలుగు దశాబ్దాల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం భూమికి రకం వసూలు చేస్తానని ప్రకటించడం సీపీఎం పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఆనాడు భూమిశిస్తూ చెల్లించని రైతులపై రెవెన్యూ సిబ్బంది దౌర్జన్యం చేసి పేద, మధ్యతరగతి పెద్ద రైతులతో సహా ఇబ్బందులు పెట్టి పరువు తీసిన స్థితిని మళ్లీ రానీయకుండాప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రైతుల నుండి ఏదోరకంగా పన్నులు వసూలు చేసి తమ ప్రభుత్వ ఖజానా నింపుకోవాలనే ఆలోచన సరైనది కాదని ఎట్టి నిర్ణయాన్ని వెంటనే విరమించుకోకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని జహంగీర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ, మాజీ డివిజన్ కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల పైన అప్రమత్తంగా ఉండాలి



భానుపురి/హైదరాబాద్

వర్షాల సమయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన తేల్చిచెప్పారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పేవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. జూన్ 9న కోర్ అర్బన్ రీజియన్‌లో వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సైబరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు . వర్షాల సన్నద్ధతపై జూన్ 1న సమీక్ష నిర్వహించి తాను స్వయంగా అనేక సూచనలు చేశానని గుర్తుచేశారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జూన్ 9న వర్షం సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయం లోపించిందన్నారు. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌లను ఆదేశించారు. మరో సారి ఇలాంటి పరిస్థితి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షం సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనన్నారు. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తాను కూడా రోడ్డుపైకి వస్తానని ముఖ్యమంత్రి అన్నారు. వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీకి సూచించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని హెచ్చరించారు.వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్ స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు.వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షం సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ ఉండాల న్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశిం చారు.ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు సూచించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలన్నారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. యూరియా స్టాక్ , పంపణి కోసం స్థానిక వ్యవసాయ అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సన్న వడ్ల కోసం వ్యవసాయ శాఖ ప్రకటించిన ఎనిమిది రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. గతంలో తాగునీటి కాలుషితం కారణంగా జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. నీటి కలుషితంవల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌కు ముఖ్యమంత్రి సూచించారు. పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు.